క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

కాటారం : కాటారం సబ్ డివిజన్‌లో నేడు(గురువారం) రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. మల్హర్ మండలం కొండంపేటలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రం, కాటారం మండలం ధన్వాడ సమీపంలోని మీనాక్షి కాటన్ ఆగ్రో ఇండస్ట్రీస్‌లో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాన్ని మంత్రి ప్రారంభించనున్నారు. అనంతరం కాటారం మండల కేంద్రంలోని బీఎల్ఎం గార్డెన్స్‌లో రెడ్డిగాండ్ల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాశ్ రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమంలో మంత్రి పాల్గొననున్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



మొగుళ్లపల్లి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి పోలీసులు అప్పగించారు. మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన గన్నారపు అంజి తన మొబైల్‌ను ఇటీవల పోగొట్టుకొని పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ఫోన్‌ను గుర్తించి ఎస్సై అశోక్ ఆధ్వర్యంలో బుధవారం బాధితుడికి అప్పగించారు.

సన్మానం



రేగొండ : మండలంలోని బాగిర్థిపేట గ్రామానికి చెందిన పెరుమండ్ల తిరుపతి జయశంకర్ భూపాలపల్లి జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికయ్యాడు. కాగా స్థానిక కాంగ్రెస్ నాయకులు, గ్రామస్తులు తిరుపతిని సన్మానించారు.నాయకులు శాబీర్ అలీ, పిట్ట భిక్షపతి, పెండ్యాల ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఆత్మీయ సమ్మేళనం

కాళేశ్వరం : రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ చైర్మన్ అయిత ప్రకాశ్‌రెడ్డి ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు హాజరు కావాలని డీసీసీ ప్రధాన కార్యదర్శి కామిడి శ్రీనివాసరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కాటారంలోని బీఎల్ఎం గార్డెన్‌లో (నేడు) గురువారం ఉదయం 11గంటలకు జరుగు కార్యక్రమానికి మంత్రి శ్రీధర్‌బాబు, ఎంపీ వంశీకృష్ణ, శ్రీపాదట్రస్టు చైర్మన్ శ్రీనుబాబులు హాజరు కానున్నారని ఆయన పేర్కొన్నారు.

నిధులు కేటాయించాలి

ములుగు : జిల్లాలోని గ్రంథాలయాలకు నూతన భవనాలు, పాఠకులకు అవసరమైన పుస్తకాల కొనుగోలుకు, సౌకర్యాలకు నిధులు కేటాయించాలని జిల్లా గ్రంథాలయాల సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ కోరారు. ఈ మేరకు బుధవారం గ్రంథాలయ సంస్థ రాష్ట్ర చైర్మన్ ఎండీ రియాజ్ 18 జిల్లాల చైర్మన్లతో ఏర్పాటు చేసి ప్రోటోకాల్‌పై చర్చించారు. సమావేశంలో రవిచందర్ మాట్లాడారు. ఉద్యోగులకు వేతనాల అంశంపై వివరించారు. దీనిపై ఎండీ రియాజ్ సానుకూలంగా స్పందించినట్లు రవిచందర్ తెలిపారు.

లక్షలు వెచ్చించి..వృథాగా వదిలేసి..

- నిరుపయోగంగా పల్లె దవాఖానాలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



నిరుపయోగంగా పల్లె దవాఖాన భవనం

రేగొండ : ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో పల్లె దవాఖానల నిర్మాణానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా రూ.లక్షలు నిధులు మంజూరు చేసి నిర్మించిన భవనం ప్రారంభానికి నోచుకోకపోవడంతో అలంకారప్రాయంగా మారింది. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటినా విద్యుత్ కనెక్షన్ ఇవ్వలేదనే సాకుతో అధికారులు నిర్లక్ష్యంగా దాటవేస్తు వస్తున్నారు. దీంతో పల్లె దవాఖాన భవనాలను నిరుపయోగంగా వదిలేశారు. అధికారులు స్పందించి భవనాన్ని త్వరగా ప్రారంభించి అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు కోరుతున్నారు.

రూ.20 లక్షలు వెచ్చించినా..

మండల కేంద్రంతో పాటు మండలంలోని తిరుమలగిరి, కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాకలో ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలు ఉన్నాయి. కొన్నేళ్లుగా గ్రామాల్లోని చిన్నగదిలో సబ్ సెంటర్‌ను నిర్వహిస్తున్నారు. అయితే రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం సబ్ సెంటర్‌లకు నూతన భవనాల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేసింది. ఆయా గ్రామాల్లో రూ.20 లక్షల నిధులు ఖర్చు చేసి సబ్‌సెంటర్ భవన నిర్మాణాన్ని చేపట్టారు. భవన నిర్మాణం పూర్తయి ఏడాది దాటిన ఇప్పటి వరకు వాటిని ప్రారంభించ లేదు.

నిర్మాణం పూర్తయినా..

మండలంలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రం భవనానికి విద్యుత్ కనెక్షన్ ఇవ్వడం లేదని..అందుకు అవసరమైన నిధులు ప్రభుత్వం నుంచి మంజూరు కావాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. భవనాల నిర్మాణం పూర్తయిన అందులో కరెంట్ ఫిట్టింగ్ జరగలేదు. ఈ కారణంగానే భవనాన్ని ప్రారంభించలేకపోతున్నట్లు పేర్కొన్నారు. దీంతో రూ.లక్షలు ఖర్చు పెట్టి నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం ప్రారంభానికి నోచుకోలేదు. ఇదే విషయంపై జిల్లా వైద్యాధికారి మధుసూదన్‌ను వివరణ కోరగా.. మండల కేంద్రంతో పాటు తిరుమలగిరి, కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాకలో నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రాలు దాదాపుగా పూర్తయ్యాయి. కానీ కాంట్రాక్టర్ భవనాన్ని తమకు అప్పగించలేదన్నారు. కొన్ని పనులు పెండింగ్‌లో ఉన్నాయని, అవి పూర్తి చేసి అప్పగిస్తే ఆరోగ్య ఉపకేంద్రాన్ని నిర్వహిస్తామని పేర్కొన్నారు.

వ్యసనాలకు బానిస కావొద్దు



వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్సై శాఖాన్, ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు

చిట్యాల : విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలే తప్ప డ్రగ్స్, వ్యసనాలకు అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్సై ఎండీ శాఖాన్, సైకియాట్రిస్ట్ డాక్టర్ రాము సూచించారు. ఈ సందర్భంగా బుధవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్, ప్రహరీ క్లబ్ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.శ్రీదేవి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. విద్యార్థులకు మానసిక, డ్రగ్స్, వ్యసనాలపై అవగాహన కల్పించారు. అలాగే విద్యార్థులు ఎట్టి పరిస్థితుల్లోను డ్రగ్స్ మాదక ద్రవ్యాలకు అలవాటు కాకుడదని అన్నారు. అలాగే మాదకద్రవ్యాలకు అలవాటు పడితే చట్టపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటారని తెలిపారు. అనంతరం సే...నో... టూ. డ్రగ్స్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ పీఓ యుగేందర్, ప్రహరీ క్లబ్ సభ్యులు కానిస్టేబుల్ లింగన్న, లెక్చరర్లు బాలకృష్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గండ్ర

మొగుళ్లపల్లి : మొగుళ్లపల్లి, భూపాలపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ లబ్ధిదారులకు ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు బుధవారం చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదలకు అండగా కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం నిలుస్తోందన్నారు. ప్రజా ప్రభుత్వంలో నేరుగా లబ్ధిదారులకే సంక్షేమ పథకాలు అందుతున్నట్లు తెలిపారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని కల్పించినట్లు ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వం ద్వారా ఇచ్చే సబ్సిడీ గ్యాస్, రేషన్ కార్డులు, ఇళ్ల స్థలాలను కూడా మహిళల పేరుతోనే పంపిణీ చేస్తామన్నారు. ప్రజాపాలన దరఖాస్తులను పరిశీలించి అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందిస్తామని ఎమ్మెల్యే వివరించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సునీత, ఎంపీడీఓ హుస్సేన్, చిట్యాల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండీ. రఫీ, నాయకులు ఎర్రబెల్లి పున్నంచందర్‌రావు, శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మండల కేంద్రంలో జరిగిన పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనలో ఎమ్మెల్యే గండ్ర నారాయణరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

యాదవులకు అన్యాయం



సమావేశంలో మాట్లాడుతున్న నరేష్ యాదవ్

చిట్యాల : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కులగణనలో యాదవ జనాభాను శాస్త్రీయంగా స్పష్టం చేయాలని యాదవ సంఘం మండల అధ్యక్షుడు మర్రి నరేష్ యాదవ్ కోరారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న కులగణన సర్వేలో యాదవుల జనాభా అత్యధికంగా ఉన్నప్పటికి రాజకీయంగా, ఆర్థికంగా, విద్యా, సామాజికంగా వెనుకబడి ఉన్నారని అన్నారు. యాదవ జనాభా తక్కువగా చూపెడుతూ తీవ్ర అన్యాయానికి గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. యాదవ కులస్తుల పేరు చివరన యాదవ అని, ఫారం నంబర్-7లో చేర్చడం ద్వారా యాదవుల జనాభా శాస్త్రీయంగా స్పష్టం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బుట్టి ఉపేందర్, హరీష్, తిరుపతి, అనిల్, రవి తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల పరిశీలన



బ్యాంక్ మేనేజర్‌తో మాట్లాడుతున్న డీఎస్పీ

భూపాలపల్లి అర్బన్ : జిల్లా కేంద్రంలోని ఎస్‌బీఐ భద్రత చర్యలను బుధవారం స్థానిక డీఎస్పీ సంపత్‌రావు పరిశీలించారు. అనంతరం బ్యాంక్ మేనేజర్ కార్యాలయంలో సెక్యూరిటీ సిస్టమ్, సీసీ కెమెరాలను పరిశీలించి మేనేజర్‌తో చర్చించారు. సెక్యూరిటీ పరంగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐ నరేష్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు. అనంతరం సీసీ కెమెరాల ఏర్పాటుకు పట్టణంలోని ఐరన్ హార్డ్‌వేర్, ఎలక్ట్రికల్ షాపుల యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక సీఐ నరేష్‌కుమార్‌కు రూ.1.10లక్షల నగదును అందించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

కాటారం : మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. ఉమ్మడి వరంగల్ జిల్లా స్థాయి 68వ క్రీడా పోటీలు అండర్-19 విభాగంలో క్రికెట్‌లో సుచరిత, సాయికీర్తన, వాలీబాల్‌లో జ్యోత్స్న, యోగిత, కబడ్డీలో హారికశ్రీ, ఖోఖోలో సుస్మిత, డిస్కస్ త్రోలో బిందుప్రియ, షాట్‌పుట్‌లో సాయికీర్తన అత్యంత ప్రతిభ కనబర్చారు. దీంతో నిర్వాహకులు వీరిని రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపాల్ నాగలక్ష్మి తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ సరిత, కల్పన, పీడీ గౌతమి, పీఈటీ విద్యా, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

కిసాన్ క్రెడిట్ కార్డును సద్వినియోగం చేసుకోవాలి

కాళేశ్వరం : రైతులు కిసాన్ క్రెడిట్ కార్డును సద్వినియోగం చేసుకోవాలని మండల పశు వైద్యుడు రాజబాపుగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో సూచించారు. పశు సంపద ఉన్న ప్రతి రైతు రూ.1.60లక్షల వరకు ఎలాంటి సెక్యూరిటీ లేకుండా కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా బ్యాంకు నుంచి రుణం పొందవచ్చన్నారు. పాడి పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకదారులై ఉండాలని తెలిపారు. వ్యవసాయ పంట రుణం తీసుకోవాలనుకుంటే రూ.3 లక్షల వరకు పొందవచ్చన్నారు. అందులో రూ.1.60 లక్షల వరకు పాడి పశువులు, కోళ్ల పెంపకానికి అప్పు తీసుకోవచ్చని వివరించారు. మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన తెలిపారు.

అపరిచితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



గొత్తికోయలతో మాట్లాడుతున్న ఎస్సై మహేందర్‌కుమార్

కాటారం : అపరిచితులకు, సంఘ విద్రోహ శక్తులకు ఆశ్రయం కల్పించి ఇబ్బందులు పడొద్దని మహాముత్తారం ఎస్సై మహేందర్‌కుమార్ సూచించారు. మండలంలోని సింగారం పరిధిలో గల మద్దిమడుగు గొత్తికోయగూడెంలో బుధవారం కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఇంటింటా తనిఖీలు నిర్వహించి అనుమానితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సై గొత్తికోయలతో సమావేశం నిర్వహించి వారి బాగోగులపై ఆరా తీశారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడే వారికి సహకరించొద్దని ఆయన పేర్కొన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన..

మహాముత్తారం మండలం యామన్‌పల్లి ప్రధాన కూడలిలో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనవసరపు వెబ్ లింక్‌లు ఓపెన్ చేయడం, మొబైల్‌కు వచ్చిన ఓటీపీలు అపరిచితులకు చెప్పడం, ఏటీఎంల ద్వారా జరిగే ఆన్‌లైన్ నేరాలను ప్రజలకు వివరించారు. సైబర్ నేరం జరిగిన వెంటనే 1930కి కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. 1930 ద్వారా అనేక ప్రయోజనాలు చేకూరుతున్నాయని ప్రజలు వినియోగించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్‌కుమార్‌తో పాటు పోలీస్ సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

జాతరలో నిరంతర విద్యుత్



పనులను పర్యవేక్షిస్తున్న డీఈ పాపిరెడ్డి

రేగొండ : ఈ నెల 14వ తేదీ నుంచి 18వ తేదీ వరకు జరిగే బుగులోని వెంకటేశ్వర స్వామి జాతరలో నిరంతర విద్యుత్ అందించనున్నట్లు విద్యుత్ డీఈ పాపిరెడ్డి తెలిపారు. బుధవారం జాతరలోని విద్యుత్ మరమ్మతు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ.. లక్షల సంఖ్యలో వచ్చే భక్తులకు విద్యుత్ వల్ల ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జాతరలో విద్యుత్ సమస్యలను అధిగమించేందుకు అవసరమైన ప్రతి ప్రదేశానికి తీగలు లాగుతున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాతర ఈఓ బిల్లా శ్రీనివాస్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చైన్ స్నాచింగ్

టేకుమట్ల : ద్విచక్రవాహనం వెళ్తున్న దంపతులను ఇద్దరు వ్యక్తులు వెంబడించి చైన్ స్నాచింగ్‌కు పాల్పడిన సంఘటన మండలంలోని రాఘవరెడ్డిపేట శివారులో బుధవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలంలోని కిష్టంపేటకు చెందిన పులిగోర్ల చేరాలు-వనజ దంపతులు వ్యక్తిగత పనిపై జమ్మికుంటకు వెళ్లి చిట్యాల మండలంలోని వరికోల్ పల్లికి బంధువుల ఇంటికి వెళ్తున్నారు.ఈ క్రమంలో టేకుమట్ల మండలంలోని రాఘవరెడ్డిపేట శివారులో ఇద్దరు వ్యక్తులు వారిని వెంబడించి చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. వారిని రాఘవరెడ్డిపేట వరకు వెంబడించగా కుందనపల్లి వైపు వెళ్లినట్లు తెలిపారు. కాగా చైన్ విలువ రూ.2.45లక్షలు ఉంటుందని తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గోగికారి ప్రసాద్ తెలిపారు.

అక్రమాలకు పాల్పడితే సహించేది లేదు

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు



అసోసియేషన్ నాయకులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే

భూపాలపల్లి రూరల్ : జిల్లాలోని రైస్ మిల్లర్లు రైతులు, ప్రజల మన్ననలు పొందే విధంగా పాలకవర్గం పని చేయాలని, ప్రభుత్వ నిబంధన ప్రకారం రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవాలని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ఏఎస్ఆర్ గార్డెన్‌లో బుధవారం జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నూతన పాలకవర్గం పదవీ ప్రమాణ స్వీకార కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరు కాగా, విశిష్ట అతిథులుగా వరంగల్ జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు తోట సంపత్ కుమార్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు పెద్ది ప్రవీణ్ కుమార్ గౌడ్, ములుగు జిల్లా అధ్యక్షుడు బాదం ప్రవీణ్, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు వెంగళ వినయ్‌కుమార్ హాజరయ్యారు. అనంతరం నూతనంగా ఎన్నికైన జిల్లా రైస్ మిల్లర్ అసోసియేషన్ అధ్యక్షుడు పెరుమాళ్ల తిరుపతి గౌడ్‌తో పాటు పాలకవర్గమును సన్మానించి ప్రమాణస్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైస్ మిల్లర్ల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి సమస్యలను పరిష్కరించే దిశగా కృషి చేస్తానన్నారు. అదేవిధంగా అవినీతి అక్రమాలకు పాల్పడితే సహించేది లేదని పేర్కొన్నారు.గణపురం మండలం గాంధీనగర్‌లో 60 ఎకరాలలో ఇండస్ట్రీస్ ఏర్పాటుకు శంకుస్థాపన చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలోఅసోసియేషన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు కోరె రమేష్, సెక్రటరీలు కాసిల్ రవీందర్ రెడ్డి, యంసాని సంతోష్, ఉపాధ్యక్షులు అల్లూరు రవీందర్ రెడ్డి, బిక్షపతి, జనరల్ సెక్రటరీ వెంకటస్వామి, జాయింట్ సెక్రటరీ రవి, ఆర్గనైజేషన్ సెక్రటరీ నల్లబెల్లి అభినవరావు, ఈసీ మెంబర్లు రఘుపతి రెడ్డి, సంతోష్ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణయ్య, శ్రీదేవి నియోజకవర్గం పరిధిలోని సొసైటీ చైర్మన్లు రైస్ మిల్లర్లు తదితరులు పాల్గొన్నారు.

అవగాహన కలిగి ఉండాలి

ములుగు : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సైబర్ క్రైం డీఎస్పీ సందీప్‌రెడ్డి సూచించారు. బుధవారం జిల్లాకేంద్రంలోని రిటైర్డ్ భవన్‌లో సీనియర్ సిటిజన్ దివస్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ ముఖ్యంగా ఆన్‌లైన్ మోసాలపై జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అనంతరం లావాదేవీలు, అపరిచితులకు బ్యాంకు అకౌంట్ వివరాలు, ఓటీపీ నంబర్‌లు చెప్పడం, ఆన్‌లైన్ లింకుపై క్లిక్ చేయద్దన్నారు. ఒకవేళ సైబర్ నేరంలో మోసపోయినట్లుగా గుర్తిస్తే వెంటనే 1930 టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి వివరాలు వెల్లడించాలని తెలిపారు.

సమగ్ర సర్వేకు సహకరించాలి



మల్హర్: పెద్దతూండ్లలో ఇంటికి స్టిక్కర్ వేస్తున్న అధికారులు



కాటారం: స్టిక్కరింగ్ ప్రక్రియను పరిశీలిస్తున్న ఎంపీడీఓ, ఎంపీఓ



చిట్యాలలో..



కాళేశ్వరం: ఎడపల్లిలో..



మల్హర్: రుద్రారంలో..

కాటారం : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర సర్వేలో భాగంగా ఇంటి వద్దకు వచ్చే సిబ్బందికి ప్రజలు సహకరించాలని ఎంపీడీఓ బాబు కోరారు. సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, కుల సమగ్ర సర్వే ప్రక్రియలో భాగంగా కాటారం మండలంలోని 24 గ్రామపంచాయతీల్లో బుధవారం అధికారులు, సిబ్బంది ఇంటి వివరాలతో పాటు స్టిక్కరింగ్ వేశారు. పలు గ్రామ పంచాయతీల్లో కొనసాగిన ప్రక్రియను ఎంపీడీఓ బాబు, ఎంపీఓ వీరస్వామి పరిశీలించారు. సర్వేలో భాగంగా నమోదు చేసుకోవాల్సిన వివరాలు, పాటించాల్సిన జాగ్రత్తలపై సర్వే అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, సర్వే సూపర్‌వైజర్లు, ఎన్యుమనేటర్లు పాల్గొన్నారు.

సర్వే ప్రారంభం

మల్హర్ : సమగ్ర సర్వేలో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో బుధవారం ఎన్యుమరేటర్ల, సూపర్‌వైజర్లు ప్రతి కుటుంబం వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా మండల వ్యాప్తంగా 8,795 గృహాలకు 63మంది ఎన్యుమరేటర్లు, ఏడుగురు సూపర్ వైజర్లు బుధవారం 3,852 ఇళ్ల జాబితా వివరాలకు స్టికర్లు అంటించారు. రెండ్రోజుల పాటు చేపట్టనున్న ఇంటి వివరాల సేకరణ అనంతరం సమగ్ర కుటుంబ సర్వే చేయనున్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ శ్యామ్‌సుందర్, ఏఎస్ఓ శివకృష్ణ, ఎన్యుమరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

కుటుంబాల గుర్తింపు ప్రారంభం

చిట్యాల : మండలంలోని అన్ని గ్రామాల్లో కుటుంబాల గుర్తింపు ప్రక్రియను నిర్వహించినట్లు ఎంపీడీఓ జయశ్రీ తెలిపారు. ఈ సందర్భంగా బుధవారం సమగ్ర సర్వేలో భాగంగా ప్రతి ఇంటికి స్టిక్కరింగ్ చేసినట్లు ఆమె తెలిపారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హేమ, ఏఎస్ఓ సాయి, పంచాయతీ కార్యదర్శులు, ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

కాళేశ్వరం : రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సామాజిక, ఆర్థిక, విద్యా, ఉపాధి, రాజకీయ, కులగణన సర్వే సిబ్బందికి సహకరించాలని ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ ప్రహ్లాద్‌రాథోడ్‌లు బుధవారం తెలిపారు. మండల వ్యాప్తంగా సర్వే బృందాలు మూడ్రోజుల పాటు గ్రామాల్లో కుటుంబాలను గుర్తించిన అనంతరం సర్వే ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే కులగణన సర్వేలో భాగంగా బుధవారం కాళేశ్వరం గ్రామపంచాయతీలో ఇంటింటికి స్టిక్కరింగ్ వేశారు.

రేగొండ (కొత్తపల్లిగోరి) : రేగొండ, కొత్తపల్లిగోరి మండలాల్లోని పలు గ్రామాల్లో బుధవారం సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభమైంది. సర్వేలో భాగంగా మొదటి రోజు ఇళ్ల గుర్తింపు నిర్వహించి స్టిక్కర్లు అంటించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వీరభద్రం మాట్లాడుతూ..ప్రభుత్వం చేపట్టిన సర్వేకు ప్రజలు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాంబాబు, కారోబార్ నాగరాజు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలి

- ఎంఎస్పీ జాతీయ నేత మంద కుమార్‌మాదిగ

ఏటూరునాగారం : ఎస్సీ వర్గీకరణ తీర్పును అమలు చేస్తామని మాదిగలను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశారని మహాజన సోషలిస్ట్ పార్టీ జాతీయ నేత మంద కుమార్ మాదిగ అన్నారు. బుధవారం మండల కేంద్రంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణ ప్రకారం ఉద్యోగాల భర్తీ చేస్తామని ప్రకటించి, వర్గీకరణ లేకుండా ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేసి మాదిగలకు మోసం చేశాడని విమర్శించారు. మాదిగల వ్యతిరేక వైఖరికి నిరసనగా డిసెంబర్ 21న ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ చేపడుతున్న కార్యక్రమానికి తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వే ల్పుల సూరన్న కాపు, బొడ్డు దయాకర్, బొర్ర భిక్షప తి, బూర సతీష్, ఇరుగు పైడి, నెమలి నర్సయ్య, మడిపల్లి శ్యాం, గజ్జెల ప్రసాద్, పుల్లూరి కరుణాకర్, సాంబశివరావు, ఎంపెల్లి శంకర్, గోపి, వేంపల్లి జాషువ, రమేష్, ఉపేందర్, మల్లేష్ పాల్గొన్నారు.